క్లుప్తంగా

ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన ర్యాలీ



ట్రాఫిక్ సిగ్నల్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ వాలంటీర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ల దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ వాలంటీర్లు సోమవారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు రెడ్ క్రాస్ వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ వర ప్రసాదరావు, ట్రాఫిక్ ఏఎస్ఐ ఏవైఆర్ రాజు, సోషల్ వర్కర్ సీహెచ్‌వీ సురేంద్ర, డాక్టర్ జి.స్పందన, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ వి.నాగరాజు, ట్యూటర్లు ఎ.ప్రియాంక, రెడ్ క్రాస్ ఏఎన్ఎం నర్సింగ్ విద్యార్థినులు, కానిస్టేబుల్స్ కె.శ్రీనివాస్, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పోణంగి ప్రాథమిక పాఠశాలలో..

మండలంలోని పోణంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కందుల రాంబాబు అధ్యక్షుడిగా వ్యవహరించగా, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ మాట్లాడారు. రహదారి భద్రత నియమాలను పాటించాలని, ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరు దోహదపడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి భద్రత ప్రతిజ్ఞను చేయించారు.

భోజన వితరణ పునరుద్ధరణ



భోజనం వడ్డిస్తున్న ఏఎస్పీ స్వర్ణకుమారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : భగవాన్ శ్రీ సత్య సాయిబాబా అనుగ్రహ ఆశీస్సులతో ప్రతి సోమవారం పోలీసు శాఖలో స్పందనకు వచ్చే అర్జీదారులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ద్వారా భోజన ప్రసాద వితరణ పునరుద్ధరించినట్టు ఆ సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు తెలిపారు. భోజన వితరణ ఇటీవల జరిగిన ఎన్నికల కారణంగా తాత్కాలికంగా ఆగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి భోజన వితరణ కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ బి.స్వర్ణకుమారి పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా 60 మంది వరకు భోజనం స్వీకరించారు. కార్యక్రమంలో ఏలూరు సబ్ జోన్ కోఆర్డినేటర్ వై.వెంకటేశ్వరరావు, జాయింట్ కోఆర్డినేటర్ పీవీ సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారులపై గోవుల సంచారం

- ప్రమాదాలకు కారణమవుతూ.. ఒక్కోసారి గాయపడుతూ
- ఏలూరు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు
- స్పందించని అధికారులు



ఏలూరు కొత్త బస్టాండు వద్ద రహదారిపై గోవుల సంచారం



పత్తేబాద రోడ్డులో రహదారిపై గోవుల తిష్ట

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు నగర రహదారులపై గోవుల సంచారం ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతోంది. యజమానులు ఉదయం గోవుల పాలు తీసుకుని మిగిలిన సమయాల్లో రహదారులపైకి వాటిని వదిలేస్తున్నారు. అవి వీధుల్లో తిరుగుతూ కనిపించిన గ్రాసాన్ని తింటూ.. ఒక్కోసారి పాచిపోగులపై ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను తింటూ అనారోగ్యం పాలౌతున్నాయి. హోటళ్లు, బజ్జీల బండ్లు, నూడిల్స్ బండ్ల వద్ద ఉన్న వ్యర్థాలను కూడా తింటూ అవి విసర్జించే పేడ దుర్వాసన భరితంగా మారి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

నగరంలోని ప్రధాన రహదారుల కూడళ్లలో తిష్ట వేస్తున్న గోవులు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు, స్కూల్, కళాశాల బస్సులు వెళ్లే సమయాల్లో ఎంతగా హారన్ కొడుతున్నా రోడ్లపై ఉన్న గోవులు పక్కకు తప్పుకోకపోవడం వల్ల కొంత సేపు ట్రాఫిక్ నిలిచిపోతుంది. రాత్రి సమయాల్లో రహదారి మధ్యలోనే పడుకుని ఉంటున్నాయి. కొందరు వాహన చోదకులు వేగంగా వెళుతూ చీకటిలో గోవులు కనపించక వాటిని ఢీకొట్టి పడిపోయి గాయాలపాలవుతున్నారు. కొన్ని సందర్భాల్లో గోవుల కాళ్లపై నుంచి భారీ వాహనాలు ఎక్కడం వల్ల అవి గాయాలపాలవుతున్నాయి. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు లేదా ట్రాఫిక్ పోలీసులు స్పందించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజంతా రోడ్లపైనే!

నగర రోడ్లపై గోవులు తిష్ట వేస్తూ వాహన చోదకులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. ప్రధాన రహదారి అయిన ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి కొత్త బస్టాండుకు వెళ్లే రహదారి, పత్తేబాద రైతు బజారు రహదారి, సత్రంపాడు, శాంతి నగర్, శనివారపు పేట వెళ్లే రహదారి, ఒన్‌టౌన్ బిర్లాభవన్ సెంటర్, పెద్ద పోస్టాఫీసు, రామకోటి సెంటర్లతో పాటు చిన్నచిన్న వీధుల్లో సైతం గోవులు దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఆయా ప్రాంతాల్లో రహదారులపైనే ఉంటూ ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. కొన్నికొన్ని సందర్భాల్లో వాటిలో అవి కొట్లాడుకుంటూ వాహనచోదకులపైకి, పాదచారుల పైకి వెళ్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆయా సందర్భాల్లో అనేక మంది గాయాలు పాలవుతున్న ఘటనలూ లేకపోలేదు.

గోవుల సంచారాన్ని నియంత్రించాలి



రహదారులపై ప్రమాదాలకు కారణమవుతున్న గోవుల సంచారాన్ని సంబంధిత అధికారులు తక్షణమే నియంత్రించాలి. వాటి కారణంగా ప్రమాదాలపాలవుతున్న వారిలో కొందరు వికలాంగులవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయ పరిస్థితిలోకి వెళుతున్నారు. వాల్ పోస్టర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ గోవులు కూడా అనారోగ్యం పాలవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో ప్రమాదాల్లో గోవులు గాయాల పాలవడం చూస్తే హృదయ విదారకంగా ఉంటోంది.

– రెల్ల నాగరాజు, చోడిదిబ్బ, ఏలూరు

యజమానులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి



రహదారులపైకి గోవులను వదిలేయకుండా వాటి యజమానులకు అధికారులు కౌన్సెలింగ్ ఇవ్వాలి. వాటి వల్ల జరుగుతున్న అనర్థాలను పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామనే భయం యజమానుల్లో కల్పించాలి. నగరంలో ఉన్న గో సంరక్షణ సమితికి గోవులను తరలించి సంరక్షించే ఏర్పాటు చేయాలి. రహదారులపై సంచరించే గోవులను తప్పించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. వాటి వల్ల ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలి.

– గేదెల రాజారావు, చేపలతూము సెంటర్, ఏలూరు

కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న వెట్రిసెల్వి



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఏలూరు నుంచి కలెక్టర్ కె.వెట్రి సెల్వి హాజరయ్యారు. జిల్లా పరిస్థితులను కార్యక్రమంలో వివరించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగం కార్యక్రమాన్ని ఏలూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు వీక్షించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): నూజివీడు మండలంలో జరిగిన చిన్నారి అత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరక శ్యామల, మన్నవ యామిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇటువంటి ఘటనలు చిన్నారుల జీవితాలపై తీరని గాయం చేస్తాయని, వారి మానసిక స్థితి ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

కృష్ణా, గోదావరి నీటి హక్కులను పరిరక్షించండి



మీకోసంలో అధికారిణికి వినతి పత్రం అందిస్తున్న ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): కృష్ణా, గోదావరి నది జలాల పంపిణీ ద్వారా రాష్ట్రానికి సంక్రమించిన నీటి హక్కులను పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ నెల రెండో వారంలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కోరిన నివేదిక ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తన నివేదిక ద్వారా వాదనను పటిష్టంగా వినిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలోని జలశక్తి విభాగం గత సంవత్సరం అక్టోబరు 6న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి నదుల నుంచి తమకు కేటాయించాల్సిన నీటి హక్కులను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తమ వాదనలను వినిపించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం విభజన చట్టానికి వ్యతిరేకంగా నిర్మిస్తున్న పాలమూరు – రంగారెడ్డి, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్‌కు జరిగే నష్టాన్ని ట్రిబ్యునల్ ముందు నివేదించాలని తెలిపారు. నీటి పంపిణీపై ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల తాగునీటి అవసరాలకు నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేసే ఏర్పాటు చేయాలని, నీటికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి నిపుణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 11, 12, 13 తేదీల్లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకం ఎగురవేయాలని రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్‌జీ పిలుపు నిచ్చారు. బీజేపీ ఏలూరు జిల్లా ముఖ్యనాయకుల సమావేశం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాధరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. నాయకులు బొల్లినేని నిర్మలా కిషోర్, శరణాల మాలతిరాణి, కట్నేని కృష్ణప్రసాద్, అంబికా కృష్ణ, కొర్లి సుధాకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీకోసంలో అర్జీదారుల అసంతృప్తి



ఫిర్యాదులు నమోదు చేయించుకుంటున్న బాధితులు



అధికారులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి మీకోసం కార్యక్రమానికి సమస్యలతో బాధితులు పోటెత్తారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ముఖ్యమంత్రితో రాజధానిలో సమీక్షలో పాల్గొనగా, జేసీ పి.ధాత్రిరెడ్డి కలెక్టరేట్‌లో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కీలక అధికారులు ఇద్దరూ మీకోసంకు హాజరుకాకపోవడంతో అర్జీదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. మిగిలిన అధికారులు వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించి మమ అనిపించారు. కలెక్టరమ్మ ఉంటుందేమో.. తమ సమస్యలు చెప్పుకుందామని గంపెడాశతో వచ్చిన అర్జీదారులు బిక్కముఖం వేసుకుని వెనుదిరిగారు.



ఫిర్యాదు స్వీకరించేందుకు వేచి ఉన్న బాధితులు

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



పింఛన్ ఆగిందని చెప్పుకునేందుకు వచ్చిన వృద్ధురాలు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	40-48	ములక్కాడలు	7-10
బెండకాయలు	28	కంద	52
పచ్చిమిర్చి	54	బీట్‌రూట్	38
కాకర కాయలు	34-54	కీరా దోస	50
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	74
బీరకాయలు (పందిరి)	44	అల్లం	100-160
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-56	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్) : బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి తెలిపారు. స్థానిక పాముల దిబ్బ సచివాలయంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. తల్లిపాలలో ఉండే కొలస్ట్రామ్ అనే ఎంజైమ్ వల్ల పిల్లలకు అవసరమైన వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని వివరించారు. పిల్లలకు ఆరు నెలలు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని డాక్టర్ మానస సూచించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. ఏఎస్ఎం నిర్మలరాణి, సూపర్ వైజర్ ఎంఎస్‌కే భవాని, 28వ సచివాలయం కార్యదర్శి నవ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు

ఏలూరు టౌన్: అత్యుత్తమ వైద్యసేవలందించే స్థాయికి ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి సేవలను విస్తృత పరచాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యంతో విజయవాడ పీవీఆర్ కార్డియాక్, మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏలూరులోని జిల్లా సర్వజన ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత గుండె వ్యాధుల నిర్ధారణ, చికిత్సా వైద్య శిబిరాన్ని పలువురు వైద్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సీహెచ్ సుధాకర్, పీవీఆర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ పాతూరి వెంకట రామచౌదరి మాట్లాడారు. డీసీహెచ్ఎస్ జి.పాల్ సతీష్ కుమార్, ఆర్ఎంఓ దుర్గాకుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ పి.మల్లికార్జున రాజు తదితరులు పాల్గొన్నారు.

రుగ్మతలకు సహజ పరిష్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎటువంటి రుగ్మతలైనా, అనారోగ్యాలైనా ధ్యానంతో పరిష్కారమౌతాయని శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్, పిరమిడ్ గృహస్థి ఆశ్రమ నిర్వాహకులు ఎస్ మునిబాబు తెలిపారు. స్థానిక గులాబితోట సాయిబాబా మందిరంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యానంపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు.

కష్టజీవుల అభ్యున్నతికి కృషి చేయాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కార్పొరేట్ సంస్థల సంపదను పున:పరిశీలన చేసి కష్ట జీవుల అభ్యున్నతికి ఖర్చు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే అధ్యక్షతన స్థానిక స్ఫూర్తి భవన్‌లో సోమవారం నిర్వహించారు. సెప్టెంబరు 1 నుంచి 3 వరకు విశాఖపట్టణంలో నిర్వహించే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా కార్మిక హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా మార్చడానికి ప్రయత్నించిందని విమర్శించారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు, ఉప ప్రధాన కార్యదర్శులు చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జి.అంజమ్మ, ఎ.అప్పలరాజు, పుప్పాల కన్నబాబు, కారం దారయ్య, ఎస్‌కే సైదా, కారం కుమారి, బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

ఏలూరు (టూటౌన్): కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతూ ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు నగర కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ ఏలూరు, పరిసర ప్రాంతాల్లో కుక్కల బెడద వల్ల అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాదచారులు, వాహనచోదకులు, స్కూల్‌కి వెళ్లే విద్యార్థులను కుక్కలు వెంటపడి పరుగులు పెట్టిస్తున్నాయని, గాయ పరుస్తున్నాయని వివరించారు. వెంటనే తగు చర్యలు చేపట్టి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని ఏపీ మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ తరపున శ్యామలారాణి విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో గల్లా శారద, సైదాని లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

9న కార్పొరేట్స్ క్విట్ ఇండియా నిరసనలు

ఏలూరు (టూటౌన్): అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని కోరుతూ ఈ నెల 9న క్విట్ ఇండియా డే సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కార్పొరేట్ క్విట్ ఇండియా నినాదంతో చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపు నిచ్చింది. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం సోమవారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం (అన్నేభవనం, స్ఫూర్తి భవన్) నాయకులు కె.శ్రీనివాస్, డేగా ప్రభాకర్, రాయంకుల లక్ష్మణరావు, బీకేఎంయూ, కాంగ్రెస్ కిసాన్ సెల్, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: జాతీయ రహదారి పక్కన ఆగిఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన నిర్మలానాయక్ (40), అతని భార్య పింకీ నాయక్ ఆదివారం బైక్‌పై ద్వారకాతిరుమల దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఏలూరు నగర శివారు వద్దకు వచ్చేసరికి ఒక హోటల్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వీరు ఢీకొన్నారు. దీంతో నిర్మలా నాయక్, అతని భార్య పింకీ నాయక్‌కు తీవ్రగాయాలు కాగా, స్థానికులు వీరిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి, అనంతరం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ నిర్మలా నాయక్ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

